క్లుప్తంగా

దివ్యాంగులకు బస్ పాసుల జారీ



దివ్యాంగులకు బస్ పాసులు అందిస్తున్న ఎంపీపీ

బుచ్చెయ్యపేట: గాజువాక ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో సోమవారం తురకలపూడిలో దివ్యాంగులకు ఉచిత బస్ పాసుల శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి వంద మంది దివ్యాంగులకు బస్ పాసులను పంపిణీ చేశారు. సీతయ్యపేట, చింతపాక, పెదపూడి, కరక, చిట్టియ్యపాలెం, పెదపూడి, తైపురం, రాజాం తదితర గ్రామాల నుంచి దివ్యాంగులు వచ్చి సిటీ, రూరల్ ఆర్టీసీ బస్ పాసులను పొందారు. సర్పంచ్ గోవింద, మాజీ సర్పంచ్ అప్పలనాయుడు, సామాజిక కార్యకర్త నాగేశ్వరరావు, ఆర్టీసీ సిబ్బంది కనకరాజు పాల్గొన్నారు.

అనాదీన భూ సాగుదారుల నమోదు

మాకవరపాలెం: అనాదీన భూముల సాగు వివరాలు నమోదుకు తాడపాలలో సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 11.52 ఎకరాల అనాదీన భూముల్లో ఎవరైతే సాగు చేస్తున్నారో వారి వివరాలను తహసీల్దార్ ప్రసాదరావు సేకరించి నమోదు చేసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ఈ సభ ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఆర్ఐ కృష్ణమూర్తి, వీఆర్వో రమణ పాల్గొన్నారు.

ముగిసిన గౌరీపరమేశ్వర ఉత్సవాలు

గొలుగొండ: మండలంలోని అమ్మపేట, జోగుంపేట గ్రామాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన గౌరీపరమేశ్వర ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. జోగుంపేటలో గౌరీ పరమేశ్వరులను భారీగా ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. ఈ రెండు గ్రామాల్లో ఆదివారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా కమిటీ, పోలీస్ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.


ఘనంగా గౌరీపరమేశ్వర్ల సారె ఊరేగింపు



సారె ఊరేగింపులో భక్తులు

నర్సీపట్నం: చెట్టుపల్లిలో మూడు రోజుల పాటు నిర్వహించిన గౌరీపరమేశ్వర్ల ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. పల్లకిలో మేళ తాళాలతో, సంప్రదాయ పద్ధతిలో గ్రామ పురవీధుల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. అత్తారింటికి ఆడపిల్లలను సారెతో ఏవిధంగా సాగనంపుతామో అదే విధంగా పలు రకాల పిండి వంటలతో సారె ఊరేగింపు విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం గ్రామ సమీపంలో గత గౌరమ్మ చెరువులో ఉత్సవ విగ్రహాలను నిమజ్జనం చేశారు.

శరవేగంగా ఎంపీడీవో భవన నిర్మాణం



నిర్మాణంలో దేవరాపల్లి ఎంపీడీవో భవనం

దేవరాపల్లి: ఎంపీడీవో నూతన భవన నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇక్కడ పాత ఎంపీడీవో భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక చొరవతో మంజూరైన రూ.1.50 కోట్లతో నూతనంగా రెండంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. ఈ పనులను పంచాయతీరాజ్ మండల ఇంజినీర్ ఉమామహేశ్వరరావు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే డిప్యూటీ సీఎం పలుమార్లు పనులు పరిశీలించి పక్కాగా నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. ఆ మేరకు అధికారులు దగ్గరుండి యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నారు.

నేడు జిల్లా స్థాయి గుర్రపు పందేలు

చీడికాడ: తంగుడుబిల్లిలో అభయాంజనేయ స్వామి తీర్థం మంగళవారం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి గుర్రపు పరుగు పందేలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

నర్సీపట్నం ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం అధికారులను ఆదేశించారు. తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. నర్సీపట్నం డివిజన్‌లోని 12 మండలాల నుంచి మొత్తం 29 అర్జీలు వచ్చాయి. ఇవన్నీ భూ సమస్యలపై రావటం విశేషం. స్పందనపై ప్రజల్లో నమ్మకం కలిగించాలని ఆర్డీవో సూచించారు. సమస్యలపై పదే పదే అర్జీదారులు తిరగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరిష్కరించేందుకు వీలుకానీ సమస్యలపై సంబంధిత అర్జీదారునికి లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు. లేని పక్షంలో ఏమైనా ఇబ్బందులుంటే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని మండల స్థాయి అధికారులకు సూచించారు.



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం



దేవుడి మాన్యం ఆక్రమణదారులపై ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న గంగాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు

దేవుడి మాన్యం ఆక్రమణదారులపై ఆర్డీవోకు ఫిర్యాదు

రోలుగుంట: మండలంలోని ఎం.కె.పట్నం శివారు పెదపేట గ్రామ సమీపంలో గంగాలమ్మ ఆలయానికి చెందిన దేవుడి మాన్యం ఆక్రమణదారులపై ఆలయ కమిటీ సభ్యులు బరిసిన సతీష్, రుత్తల దేవుడు, కొడమ నారాయణరావు, ఓంపురి రాజబాబు సోమవారం నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఎం.కె.పట్నం శివారు ఎర్రన్నపాలెం, శింగరాజుపేట, పెదపేట, చినపెదపేట తదితర గిరిజన గ్రామాల ఆరాధ్య దైవం వీర గంగాలమ్మ అమ్మవారి ఆలయానికి చెందిన దేవుని మాన్యం సర్వే నంబర్ 23/1లో 38 సెంట్లు భూమిని వాడ పోలయ్య, అనిమిరెడ్డి రాజు ఆక్రమించి అనుభవిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ భూమిలో అరటితోట సాగులో ఉందన్నారు. ఈ విషయంపై విచారణ చేసి భూమిని అమ్మవారికి స్వాధీనపరచాలని కోరారు. దీనిపై ఆర్డీవో స్పందించి విచారణ చేసి అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ సహాయ కార్యదర్శిగా అమిత్



దొడ్డి అమిత్‌ను సన్మానిస్తున్న దృశ్యం

చోడవరం రూరల్: సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం అనకాపల్లి జోనల్ సహాయ కార్యదర్శిగా బుచ్చియ్యపేట మండలానికి చెందిన దొడ్డి అమిత్ కుమార్‌ను ఎన్నుకున్నారు. సోమవారం చోడవరంలో సంజీవని ఆస్పత్రి నేతృత్వంలో గ్రామీణ వైద్యుల వైజ్ఞానిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ఆదారి చంద్రశేఖర్, త్రిలోక్ చంద్, బండారు బాలకృష్ణ, సోనియా, నిరుపమ తదితరులు పలు రకాల వైద్య సేవల గురించి వివరించారు. అనంతరం కార్యవర్గ సభ్యుడిగా దేవరాపల్లి మండలానికి చెందిన రాపేటి ఆదినారాయణను ఎన్నుకున్నారు. సంఘం జోనల్ అధ్యక్షుడు జంగం జోషి, గౌరవాధ్యక్షుడు ముమ్మల తిరుపతిరావు, కార్యదర్శి సుగుణేశ్వరి తదితరులు అభినందించారు.

తీర్థాల్లో అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే కేసులు

సీఐ ఇలియాస్ మహమ్మద్



రావికమతం: గర్నికం, రావికమతం గ్రామాల్లో బుధవారం నిర్వహించే తీర్థాలు సందర్భంగా అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా ప్రోగ్రాంలు ఏర్పాటు చేయెద్దన్నారు. బీఎన్ రోడ్డులోనే నిర్వహించే తీర్థం సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు వలంటీర్లను ఏర్పాటు చేసి పోలీసులకు సహకరించాలని కోరారు. కోడి పందేలు, జూదం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు పాల్పడితే అరెస్ట్ చేస్తామని హెచ్చరించారు.

మండల పరిషత్ బడ్జెట్‌కు ఏకగ్రీవ ఆమోదం



మాట్లాడుతున్న ఎంపీపీ రామధర్మజ, ఎంపీడీవో మీనాకుమారి

మాడుగుల: మండల పరిషత్ బడ్జెట్‌ను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ అధ్యక్షతన సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశం జరిగింది. ఎంపీడీవో పి.ఎస్.ఎల్.వి మీనాకుమారి బడ్జెట్ వివరాలు చదివి వినిపించారు. 2022–2023 సవరించిన అంచనా బడ్జెట్ ఆదాయం రూ.31 కోట్ల 57 లక్షల 92 వేల 500, వ్యయం రూ.31 కోట్ల 53 లక్షల 55 వేలు చూపించి, మిగులుగా రూ.4,37,500 చూపించారు. 2023–24కు సంబంధించి బడ్జెట్ అంచనా ఆదాయం రూ.34 కోట్ల 83 లక్షల 15 వేలు, వ్యయం రూ.34 కోట్ల 61 లక్షల 12 వేలు చూపించి, మిగులుగా రూ.4,03,000 మిగులుగా చూపించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ మాట్లాడుతూ గతేడాది సీనరేజ్ ద్వారా ఎంత ఆదాయం వచ్చిందో తెలియజేయాలని కోరారు. ఒమ్మలి ఎంపీటీసీ గూడెపు సత్యవతితోపాటు మరి కొంత మంది ఎంపీటీసీలు తమకు గౌరవ వేతనాలు ఇంకా రాలేదని, వాటి వివరాలు ఇవ్వాలని సభ దృష్టికి తెచ్చారు. జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, ఆర్లి మాధవి, శ్రీనాథు సూర్యకాంతం, ముమ్మిన రమణబాబు, బగుడు వరహాలమ్మ, చదల కృష్ణందొర, తలారి అప్పారావు, చిన్నం లోవతల్లి, దాడి నూకరత్నం పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత రేపు

దేవరాపల్లి: బోయిలకింతాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు నర్సీపట్నం డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ జి. సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేచలం, బోయిలకింతాడ, తిమిరాం, వాకపల్లి, నీలంపేట, కొత్తూరు, ఎం. అలమండ, ఎన్.జి. నగరం, కొత్తపెంట, ములకలాపల్లి, గవరవరం, జి.జె.పురం గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. వేచలం రూరల్ ఫీడర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం తగ్గించేందుకు గాను పాడైన బ్రేకర్స్ స్థానంలో కొత్త బ్రేకర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ములకలాపల్లి గ్రామానికి ప్రస్తుతం వేచలం రూరల్ ఫీడర్ నుంచి సరఫరా అందిస్తున్నామని, ఆ గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఎం. అలమండ ఫీడర్‌కు మార్పు చేస్తున్నామన్నారు.

విద్యా ప్రాధాన్యంపై చైతన్యమే ధ్యేయం



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న సెంటీరియన్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ డైరెక్టరు మూర్తి

నాతవరం: సమాజంలో విద్యకున్న ప్రాధాన్యంపై నేటి తరానికి అవగాహన కల్పించి, వారిలో చైతన్యం తీసుకురావడమే ధ్యేయంగా పని చేస్తున్నామని సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ డైరెక్టరు కె.ఎస్.మూర్తి తెలిపారు. స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం పుస్తకాలు, పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలతోపాటు స్వచ్ఛంద సంస్థలు పేద విద్యార్థులను అన్ని విధాలుగా ఆదుకోవడానికి ముందుకు రావాలన్నారు. వచ్చే ఏడాది హైస్కూళ్ల, హాస్టళ్లలో చదివే అధిక మందికి విద్యార్థులకు విద్యా సామగ్రి అందిస్తామన్నారు. విద్యలో రాణించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. హాస్టల్ వార్డెన్ రొంగలి శివ, నెహ్రూ యువ కేంద్రం సేవా సంస్థ ప్రతినిధి కె. జీవన్ తిమోతి, హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ రెడ్డి వరహాలబాబు పాల్గొన్నారు.

ఓటుకు ఆధార్ అనుసంధానం వేగవంతం

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత, తహసీల్దార్ రమేష్‌బాబు

కె.కోటపాడు: ఓటు హక్కుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను బూత్ లెవెల్ అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బీఎల్వోలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండలంలో 49,800 ఓటర్లలో ఇప్పటికి 45 శాతం ఆధార్ అనుసంధానం ప్రక్రియ పూర్తి చేశారని తెలిపారు. మిగిలిన 55 శాతం ఓటర్లను వారి ఆధార్ కార్డులతో అనుసంధానం చేసే కార్యక్రమాన్ని 62 పోలింగ్ బూత్ లెవెల్ అధికారులు ఈ నెల 18లోగా పూర్తి చేయాలని సూచించారు. తహసీల్దార్ జె.రమేష్ బాబు, ఎంపీడీవో శచీదేవి, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ త్రిమూర్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక ప్రణాళిక

నాతవరం ఎస్ఐ లక్ష్మీనారాయణ



మలుపుల వద్ద బారికేడ్ల ఏర్పాటుకు సిద్ధం చేస్తున్న ఎస్ఐ లక్ష్మీనారాయణ

నాతవరం: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని ఎస్ఐ డి. లక్ష్మీనారాయణ తెలిపారు. మండల వ్యాప్తంగా ప్రమాదాలకు కారణమయ్యే రోడ్డు మలుపుల వద్ద 15 బారికేడ్లు ఆయన సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సీపట్నం – తుని రోడ్డులో ఎం.బెన్నవరం, ములగపూడి, డి.యర్రవరం, తాండవ జంక్షన్, శృంగవరం, ఎ.శరభవరం, గన్నవరం మెట్ట వద్ద రోడ్డు మలుపుల వద్దతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. సరుగుడు జలపాతం తాండవ ప్రాజెక్టుకు సందర్శనకు వచ్చేవారు ప్రమాదాలకు గురికాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. సారా తయారీ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఫ్రెండ్లీ పోలీసు విధానానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

కశింకోట: స్థానిక కోమటి వీధిలో త్రైత సిద్ధాంత భగవద్గీత ఆధ్యాత్మిక గ్రంథంపై సోమవారం ధర్మ ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇందూ జ్ఞాన వేదిక వారి ప్రబోధ సేవా సమితి అనకాపల్లి కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి త్రైత సిద్ధాంతంపై అవగాహన కల్పించారు. దైవాన్ని పూజించడమే కాకుండా ఆయన అందించిన భగవద్గీత ద్వారా కర్మ విధానాన్ని అనుసరించాలన్నారు. భక్తియోగం ఆచరించి మోక్షం పొంది జనన మరణ చక్రం నుంచి విముక్తి చెందాలనేదే భగవానుని ఉవాచగా పేర్కొన్నారు.

ఘనంగా అడవిరాజులబాబు పండగ



రాజులబాబును దర్శించుకుంటున్న సర్పంచ్ కన్నయ్యనాయుడు, భక్తులు

రోలుగుంట: మండలంలో రోలుగుంట, కొండపాలెం, తదితర గ్రామాల్లో అడవిరాజులబాబు పండగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆలయాలకు భక్తులు వేకువజాము నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లి భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకున్నారు. దీనిలో భాగంగా కొండపాలెంలో బంటు వారి కళ్లాల వద్ద గుడిలో మాజీ సర్పంచ్ బంటు సూర్య సన్యాసిదేముళ్లు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ బంటు పరదేసినాయుడు దంపతులు, రోలుగుంట పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ కర్రి వీరునాయుడు పూజలు చేశారు. ఇక్కడ, రోలుగుంటలో మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

నర్సీపట్నం: కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర ఆధ్వర్యంలో పెదబొడ్డేపల్లిలో అడవిరాజులబాబు పండగను ఘనంగా నిర్వహించారు. భక్తులు రాజుల బాబును దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. బలిఘట్టంలో ఈ పండగను అత్యంత వైభవంగా నిర్వహించారు. ధర్మసాగరంలో రాజుల బాబును దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సర్పంచ్ గొంప కన్నయ్య నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిడతలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అర్జునగిరి–చీడిపల్లి తారురోడ్డు పనులు ప్రారంభం

రూ. 2.15 కోట్లతో వంతెనతోపాటు రోడ్డు నిర్మాణం



తారురోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

చీడికాడ: అర్జునగిరి–చీడిపల్లి గ్రామాల మధ్య తారురోడ్డు నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇటు చీడికాడ–అటు దేవరాపల్లి మండలాలకు వారధిగా నిలిచే ఈ రోడ్డును గత పాలకులు నిర్లక్ష్యంగా వదిలేశారు. 30 ఏళ్లుగా కలగా మిగిలిన ఈ సమస్యను రెండు మండలాల ప్రజలు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి ఈ రోడ్డుతోపాటు పసుపు గెడ్డపై వంతెన నిర్మాణానికి రూ 2.15 కోట్లు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో మూడు నెలల క్రితం మట్టి, మెటల్ పోత పనులు నిర్వహించారు. తాజాగా తారుపోత పనులు చేయడంతో ఈ ప్రాంత ప్రజలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.7.6 కోట్ల స్త్రీ నిధి రుణాలు

మాకవరపాలెం: స్త్రీ నిధి ద్వారా మండలంలోని డ్వాక్రా మహిళలకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.7.6 కోట్లు పంపిణీ చేశామని స్త్రీ నిధి జిల్లా జనరల్ మేనేజర్ సునీత తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం మండలంలోని అన్ని గ్రామాల వీవోఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుణాల పొందిన వారంతా క్రమం తప్పకుండా నిర్ణీత గడువులోగా బకాయిలు చెల్లించేలా చూడాలన్నారు. సక్రమంగా కట్టని కారణంగా కలిగే ఇబ్బందులను తెలియజేయాలన్నారు. సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ రుణాల మంజూరు, చెల్లింపులపై అవగాహన కల్పించాలని సూచించారు. వెలుగు ఏపీఎం చినబాబు, సిసిలు పాల్గొన్నారు.

మహిళల విజయాలకు స్ఫూర్తి సరోజినీనాయుడు



సీనియర్ లెక్చరర్‌ని సత్కరిస్తున్న విద్యార్థినులు

చోడవరం రూరల్: భారతీయ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు విశేష కృషి చేసిన నైటింగేల్ ఆఫ్ ఇండియా సరోజినీ నాయుడు పుట్టిన రోజునే జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు తెలిపారు. ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సరోజినీనాయుడు చిత్రపటానికి పూలమాలలతో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రస్తుత మహిళలందరి విజయాలకు స్ఫూర్తి సరోజినీనాయుడే అన్నారు. అకడమిక్ కోఆర్డినేటర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ మన దేశ స్త్రీ జీవితానికి పరదేశ స్త్రీల జీవితాలకు తీవ్ర వ్యత్యాసం ఉందన్నారు. మన దేశ సంస్కృతికి సరోజినీనాయుడు అద్దం పట్టారని కొనియాడారు. అనంతరం సీనియర్ ఉపన్యాసకురాలు ఐ.వి.వి సత్యవతిని విద్యార్థులు, సహ మహిళా సిబ్బంది సత్కరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పిచ్చమ్మ, లక్ష్మి, డి.మాల్యాద్రి పాల్గొన్నారు.

మహిళా హక్కుల సాధకురాలు సరోజిని

మహిళా హక్కుల సాధనకు విశేష కృషి చేసిన మహనీయురాలు సరోజినీనాయుడు అని ప్రధానోపాధ్యాయిని బి.రవికళ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా సరోజినీనాయుడు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బాలికా విద్య ఆవశ్యకతను గుర్తించిన సరోజినీనాయుడు ఆ దిశగా తన వంతు కృషి చేశారని కొనియాడారు. ముందుగా విద్యార్థినులు పలు జాతీయ గీతాలను ఆలపించారు.

122 మందికి నేత్ర పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న ఆప్తాలమిస్ట్



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

రావికమతం: స్థానిక వాసవి క్లబ్ న్యూ, వనిత వాసవి క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కొత్తకోటలో సోమవారం నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా విశాఖ శంకర్ ఫౌండేషన్ వైద్యులు 122 మంది రోగులను పరీక్షించారు. వీరిలో 46 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరిని విశాఖ తరలించారు. ఆయా క్లబ్ సభ్యులు కె.రమేష్, కె.నరేంద్ర, అశోక్, రమేష్, రామారావు, శంకర్ ఫౌండేషన్ ఏరియా కోర్డినేటర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్లిలో 149 మందికి వైద్య పరీక్షలు

కె.కోటపాడు: వేసవిలో ఆరోగ్య సూచనలను ప్రజలు పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల సూచించారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా ఆర్లి గ్రామంలో సోమవారం 139 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. ప్రాథమికోన్నత, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. అచేతన రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి ఎనిమిది మందికి వైద్యం అందించారు. ఎంపీహెచ్ఈవో కె.వి.రాజశేఖర్, రమణ పాల్గొన్నారు.

128 మందికి ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు

మాడుగుల: స్థానిక రాజవీధిలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీపీ, సుగర్, థైరాయిడ్ గర్భిణులకు సంబంధించి 128 మందిని కేజేపురం పీహెచ్‌సీ వైద్యుడు ప్రసాద్ పాత్రుడు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలతోపాటు అచేనత రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. పీహెచ్ఎన్ ఇందిర, ఎంపీహెచ్ఈవో రవికుమార్, ఏఎన్ఎం పైడితల్లమ్మ, ఆశ కార్యకర్తలు కె.లక్ష్మి, ఎ. పరమేశ్వరి, పిల్లి వరలక్ష్మి పాల్గొన్నారు.

సేంద్రియ పంటలకు మంచి మద్దతు ధర



గవరపాలెంలో రైతులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న వెంకటలక్ష్మి

కె.కోటపాడు: సేంద్రియ విధానంలో పండించిన పంటలకు మంచి మద్దతు ధర లభించనున్నట్లు మండల ప్రకృతి వ్యవసాయ ట్రైనర్ వెంకటలక్ష్మి సూచించారు. సోమవారం గవరపాలెంలో రైతులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రకృతి సాగు విధానంపై వివరించారు. నవధాన్యాలతో సాగు చేపట్టడం వల్ల భూమి సారవంతంగా మారుతుందన్నారు. ఘనజీవామృతం, జీవామృతం భూమిలో వేయడం వల్ల సారవంతంగా మారి మంచి దిగుబడితో పంటలు పండుతాయన్నారు. అనంతరం రైతులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. లెవిల్–1 అధికారులు లక్ష్మణరావు, రాముడు, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రతిభా పాటవ పోటీలు ప్రారంభం



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మాకవరపాలెం: ఉగాది పురస్కారాల్లో భాగంగా గౌతమి లలిత కళా శిక్షణా కేంద్రం వారు ఏర్పాటు చేసిన ప్రతిభాపాటవ పోటీలు ప్రారంభమయ్యాయి. సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. దీనికి మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు ఉగాది రోజున బహుమతులు ప్రదానం చేస్తామని నిర్వాహకుడు పి.రంగరాజు తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యతను వెలికి తీసేందుకు ఏటా ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. గౌతమి లలిత కళా శిక్షణా కేంద్రం కార్యదర్శి శేషగిరిరావు, ఉన్నత పాఠశాల హెచ్ఎం అచ్యుతరామయ్య, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుందరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

8 వేల మంది వేతనదారులకు ఉపాధి లక్ష్యం



మాధవనగరంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

నాతవరం: కలెక్టరు ఆదేశాల ప్రకారం మండలంలో రోజుకు ఎనిమిది వేలకుపైగా వేతనదారులకు ఉపాధి పని కల్పించాలని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. ఆయన సోమవారం మాధవనగరం, వల్లంపేట, నాతవరం గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి క్షేత్రస్థాయి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం రోజుకు 6,500 మంది వేతనదారులకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఈ నెలాఖరులోగా లక్ష్యాన్ని అధిగమించి కూలీలకు పని కల్పించేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అవకతవకలు లేకుండా నిబంధనల ప్రకారమే పనులతోపాటు మస్టర్ రోల్ నమోదు చేయాలన్నారు. అనంతరం తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. గ్రామాల్లో వేసవి తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు.

అటవీ ప్రాంతంలో చెలరేగిన మంటలు

సబ్బవరం: అయ్యన్నపాలెం రెవెన్యూ పరిధిలోని భూదేవి చెరువును ఆనుకున్న నల్లకొండ అటవీ ప్రాంతంలో సోమవారం సాయంత్రం మంటలు చెలరేగాయి. ఇవి వ్యాపించడంతో సమీపంలోని 4 ఎకరాల్లో విస్తరించి ఉన్న అకేషియా తోటతో పాటు జీడి, జీడి మామిడి తోటలు కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న ఉపసర్పంచ్ బుదిరెడ్ల కనకరాజు గ్రామస్తులతో కలిసి వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సబ్బవరం అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బందితో కలిసి గ్రామస్తులు తీవ్రంగా శ్రమించి మంటలను అదుపుచేసినట్లు తెలిపారు. ఇంకా చిన్న మంటలు రావడంతో అటవీ అధికారులకు సమాచారం అందించారు.